సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



ప్రకృతి సాగుపై అవగాహన

డ్రమ్మిసీడర్ విధానంలో వరిసాగు చేస్తే అధిక దిగుబడి వస్తోందని వ్యవసాయ శాస్త్రవేత్త చిట్టిబాబు సూచించారు. IIలో



గ్రామాల్లో సమగ్ర సర్వే

ముంచంగిపుట్టు మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు సర్వే నిర్వహించారు. IIలో



కో-ఆర్డినేటర్లకు బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర శిక్షలో పని చేస్తున్న విద్యాశాఖ మండల కో ఆర్డినేటర్లకు బదిలీలు చేపట్టారు. IIలో

తాటి..తలెత్తుకునేలా..

కోకోనట్ బోర్డు మాదిరిగానే ఆంధ్రా కల్పవృక్షం తాటికి సంబంధించి ప్రత్యేక బోర్డు ఏర్పాటు దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. తాటి ప్రయోజనాలు చేపట్టాల్సిన చర్యలపై ఇప్పటికే రాష్ట్ర డాక్టర్ వైఎస్సార్ పందిరిమామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నివేదిక సిద్ధం చేశారు. దీంతోపాటు తాటి వనాల పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఇప్పటికే ప్రజా ప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.



దేశంలో వివిధ ప్రాంతాల నుంచి సేకరించి పందిరిమామిడి పరిశోధన స్థానంలో పెంచుతున్న తాటి రకాలు



తాటి చక్కెర

- కొబ్బరి మాదిరిగా ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు కసరత్తు
- నివేదిక సిద్ధం చేసిన పందిరిమామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన ప్రజాప్రతినిధులు



తాటి చెట్టు నుంచి నీరా సేకరణ

రంపచోడవరం : పేదల కల్పవృక్షంగా గుర్తింపు పొందిన తాటిచెట్టుపై గ్రామీణ ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు ఆధార పడ్డాయి. ఏటా ఒకొక్క చెట్టు సుమారు రూ.15 వేల విలువైన ఆధారిత ఉత్పత్తులను అందిస్తోంది. వీటి ద్వారా మరింత ఆదాయం రాబట్టేందుకు ప్రత్యేక బోర్డును ఏర్పాటుతో సాధ్యమని పందిరి మామిడి ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నివేదిక సిద్ధం చేశారు.

● తాటి కాండం, ఆకులు, కాయలు, కల్లు, నీరా తదితర ఉప ఉత్పత్తులు వివిధ రూపాల్లో ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటి వరకు ఉద్యానవనశాఖలో తాటికి సంబంధించి ప్రత్యేక బోర్డు లేదు.

ప్రత్యేకబోర్డుతో ఎంతో ప్రయోజనం

తాటి ఇటు ఉద్యాన, అటు వ్యవసాయశాఖల్లో లేకుండా పోయాయి. దీంతో ఉద్యానశాఖలో కేటాయించే అర కొర నిధులతో తాటిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రత్యేకబోర్డు ఏర్పాటు వల్ల తాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యవస్థ మెరుగుపడుతుంది.

● రాష్ట్రంలో సుమారు 3 కోట్ల వరకు తాటి చెట్లు ఉన్నాయి. బోర్డు ఏర్పాటు ద్వారా వీటిపై ఆధార పడిన కుటుంబాలకు మంచి ఆదాయం పొందే అవకాశం అందుబాటులోకి వస్తుంది.

● తెలంగాణకు చెందిన మాజీ మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్ తాటి అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేయాలని గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తాజాగా రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ తాటి బోర్డు అవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

50 రకాల ఉత్పత్తులు

● కాండం నుంచి ఆకులు, కాయలు, పండ్లు తదితర ఉత్పత్తులను పొందవచ్చు. వీటిపై రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి డా.వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానంలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి.ఇప్పటికే అనేక ఆహార ఉత్పత్తులను తయారు చేశారు. తాటి నుంచి నీరా, తాటి బెల్లం, తాటి చక్కెర, తాటి తేగల నుంచి బేకరీ ఉత్పత్తులు, ముంజెల నంచి జామ్, జెల్లీ, క్యాండీ, తాటి పండు నుంచి తాండ్ర, పానీయాలు తయారుచేయవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

● నీరాలో విలువైన పోషక పదార్థాలు ఉన్నాయి. ఐరన్, పొటాషియం, పాస్పరస్ వంటివి ఎక్కువగా ఉన్నందున రక్తహీనత నివారణకు దోహదపడుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మెరుగు పడనున్న ఆర్థిక వనరులు

మిగిలిన పంటల మాదిరిగా తాటికి కూడా బోర్డు ఏర్పాటు వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఆర్థిక వనరులు సృష్టించేందుకు దోహదం పడుతుంది. తాటి ఉత్పత్తులు వల్ల ఆరోగ్యంతో పాటు ఆదాయం లభిస్తుంది. ప్రతి తాటి చెట్టు నుంచి ఆదాయాన్ని పొందవచ్చు.

ఆహార పరిశ్రమల మాదిరిగా అనుమతి అవసరం



తాటి చెట్ల నుంచి అనేక విలువ ఆధారిత పదార్థాలు తయారు చేయవచ్చు. తాటినుంచి నీరా సేకరణ, అమ్మకం అనేది అబ్కారీ శాఖ పరిధిలో ఉన్నందున పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు రావడం లేదు. నీరా, నీరా ఆధారిత ఉత్పత్తులను ఆహార పరిశ్రమల మాదిరిగా అనుమతి ఇవ్వడం ద్వారా గ్రామంలో చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించవచ్చు.

– డా. పీసీ వెంగయ్య,
సీనియర్ శాస్త్రవేత్త, ఫుడ్ అండ్ టెక్నాలజీ,
పందిరిమామిడి ఉద్యానవన పరిశోధన స్థానం



నీరా



తాటి తాండ్ర

న్యూస్‌రీల్

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



వైవీ సుబ్బారెడ్డితో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కుంభా రవిబాబు తదితరులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ రీజనల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని శనివారం విశాఖలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, మాజీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు కలిశారు. వారితోపాటు పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా కలిశారు. అరకు నియోజకవర్గంలోని ప్రభుత్వ పథకాలు, వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను ఆయనకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వివరించారు. వచ్చే ఎన్నిల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి అందరూ కృషిచేయాలని సుబ్బారెడ్డి సూచించారు. ఆయనను అరకు పర్యటనకు ఆహ్వానించినట్టు ఎమ్మెల్యే పాల్గుణ తెలిపారు.

కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో నిత్యావసరాల పంపిణీ



కొండరెడ్డి గ్రామాలను సందర్శించిన పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

వీఆర్‌పురం: మండలంలో ఇటీవల సంభవించిన వరదలకు ముంపునకు గురైన కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్‌కలెక్టర్ శుభంబన్సల్ శనివారం పర్యటించారు. బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులు, టార్పాలిన్లు అందజేశారు. గోదావరి పరివాహక, రహదారి మార్గం లేని తుమ్మిలేరు, కొండేపూడి, కొల్లూరు, గొందూరు గ్రామాల్లో శనివారం బోటు మార్గంలో పర్యటించారు. తుమ్మిలేరు గ్రామంలో వరద బాధితులను పరామర్శించారు. సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ ఇంటింటా ఓటరు సవరణ సర్వేను ఆయన పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, వీఆర్వో రామిరెడ్డి పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలకు ఏర్పాట్లు పూర్తి

అడ్డతీగల: ధర్మ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం అడ్డతీగలలో అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం నిర్వహించనున్న సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక సాయి సన్నిధి ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు పర్యవేక్షిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 170 మంది దంపతులు పేర్లు నమోదు చేసుకున్నారని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు.

నేడు యూపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మహారాణిపేట: నగరంలో ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యూపీఎస్సీ జాయింట్ సెక్రటరీ ముఖేష్ లాల్ తెలిపారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణపై శనివారం కలెక్టర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నగరంలో మొత్తం 5 పరీక్ష కేంద్రాల్లో 1,869 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, అండర్ సెక్రటరీ ఆర్కే దీక్షిత్, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

- బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఎస్పీ తుహిన్‌సిన్హా
- కోతులగుట్టలో హెలిప్యాడ్ ఏర్పాటు



కూనవరం బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కూనవరం: మండల కేంద్రం కూనవరంలో ఈనెల 7వతేదీ సోమవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. నాలుగు మండలాలకు చెందిన వరద బాధితులు కష్ట సుఖాలను తెలుసుకొని వారితో నేరుగా మాట్లాడేందుకు సభాస్థలి ఏర్పాటు చేయనున్న స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాట్లను ఎస్పీ తుహిన్‌సిన్హా శనివారం సాయంత్రం పరిశీలించారు. జగ్గవరం పంచాయతీ కోతులగుట్టలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) అనిల్‌కుమార్, రంపచోడవరం ఏఎస్పీ జగదీష్, చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనన్, ఓఎస్డీ కేవీ మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



కోతులగుట్టలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి



కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- ఐటీడీఏలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

పాడేరు రూరల్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన ప్రతి బిడ్డకు తప్పనిసరిగా తల్లి ముర్రుపాలు పట్టాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు.స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతాలు, చిన్నారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు క్రమం తప్పకుండా తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించాలన్నారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లను ఎమ్మెల్యే గర్భిణులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల మహిళ అధ్యక్షురాలు ఊర్వశిరాణి, ఐసీడీఎస్ సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జీవవైవిధ్యాన్ని కాపాడాలి

డీఎఫ్‌వో పుష్ప సౌజన్య

చింతూరు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడాలని చింతూరు డీఎఫ్‌వో పుష్ప సౌజన్య అన్నారు. ఐటీసీ సహకారంతో సొసైటీ ఫర్ సంపూరణ గ్రామస్వరాజ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎటపాక మండలం లక్ష్మీపురంలో రైతులకు ఆమె మొక్కలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు కృష్ణకిషోర్, సతీష్, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.

నెల్లిపాక: ఐటీసీ బంగారు భవిష్యత్తు సహకారంతో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలను రైతులకు చింతూరు డీఎఫ్‌వో సౌజన్య పంపిణీ చేశారు. ఐటీసీ బంగారు భవిష్యత్తు మేనేజర్స్ హేమంత్, సాగర్. సొసైటీ పర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఆత్రం సతీష్ కుమార్, సొసైటీ పర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు సతీష్,గణేష్ లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శి అడబాల కిరణ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ బుద్దుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళా రైతుకు మొక్క అందిస్తున్న డీఎఫ్‌వో పుష్పసౌజన్య

పోస్టాఫీసుల్లో జాతీయ జెండా అమ్మకాలు



మాట్లాడుతున్న ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల అమ్మకాలు చేపడుతున్నట్టు అరకు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అరకు పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని సబ్ పోస్టాఫీసులు, బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా జాతీయ జెండాల అమ్మకాలు చేపడుతున్నట్టు తెలిపారు. కేవలం రూ.25లకు జాతీయ జెండాను అందిస్తున్నామన్నారు. గ్రామాలకు సమీపంలో ఉండే బ్రాంచ్ పోస్టాఫీసులకు వెళ్లి జాతీయ జెండాను కొనుగోలు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, స్వాతంత్ర దినోత్సవ పండుగను గ్రామ గ్రామాల్లో ఘనంగా జరుపుకోవాలని తెలిపారు.

నేడు గిరిజన ఉపాధ్యాయ సంఘ ఎన్నికలు

ఏర్పాట్లు పూర్తి చేసిన రాష్ట్ర నేతలు

పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు పాడేరు పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నేతలు పూర్తి చేశారు.

బరిలో రెండు ప్యానళ్లు..

ఈ ఎన్నికల్లో రెండు ప్యానళ్ల నుంచి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ప్యానల్- ఏ నుంచి అధ్యక్షుడిగా కోడా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా కూడా రాంబాబు, ప్యానల్-బి నుంచి అధ్యక్షుడిగా కంబిడి నీలకంఠం, ప్రధాన కార్యదర్శిగా మసాడ శోభన్ బాబు బరిలో ఉన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల గిరిజన సంక్షేమ ఆశ్రమ , జీపీఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులు సుమారు 1200 మంది ఓటింగ్ పాల్గొనున్నారు.

ఆశ్రమ పాఠశాలలో పోలింగ్ కేంద్రం

పాడేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షణ, పరిశీలకుడిగా రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు పలాసి కృష్ణారావు, హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు ఎస్. పూర్ణచంద్రరావు, హెచ్‌ఎంల సంఘం గౌరవ అధ్యక్షుడు రీమలి జాన్ వ్యవహరిస్తారు. ఆదివారం జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల ముఖ్య అధికారి జీవీవీ ప్రసాద్, ఎన్నికల అధికారులు శేషాద్రి, ఎం. అప్పారావు, ఎస్. సన్యాసిరావు, ఎం. బాలరాజు తెలిపారు. ఓటు వేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా గుర్తింపు కార్డును తీసుకురావాలని వారు సూచించారు.

లక్ష ఎకరాలకు చేరువలో కాఫీ ప్రాజెక్ట్

- ఇప్పటికే 84 వేల ఎకరాల్లో ప్లాంటేషన్
- మరో 16 వేల ఎకరాల్లో నాటేందుకు ఏర్పాట్లు
- 2.20 లక్షల మొక్కలను సిద్ధం చేసిన ఐటీడీఏ కాఫీ విభాగం

సాక్షి, పాడేరు: మన్యంలో కాఫీ సాగు విస్తీర్ణం పెరగనుంది. ప్రస్తుతం పాడేరు డివిజన్ పరిధిలో 2లక్షల ఎకరాల్లో గిరిజనులు సాగు చేస్తున్నారు. వీటిలో 1.5 లక్షల ఎకరాలు కాఫీ ఫలసాయం ఇస్తున్నాయి. ఈ ఏడాది మరో 16 వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు పాడేరు ఐటీడీఏ చర్యలు చేపట్టింది.

● ఏజెన్సీలో ఏప్రిల్,మే నెలల్లో గిరిజన రైతులు చేపట్టిన కాఫీ నర్సరీలకు వాతావరణం అనుకూలించడంతో కాఫీ మొక్కలు ఆశాజనకంగా పెరిగాయి. 16 వేల ఎకరాలకు సంబంధించి 2.20 లక్షల మొక్కలను ఐటీడీఏ కాఫీ విభాగం సిద్ధం చేసింది. ఈనెల 8 నుంచి కాఫీ మొక్కలు నాటించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.



నర్సరీలో ఆశాజనకంగా పెరిగిన కాఫీ మొక్కలు

చివరి దశకు ప్రాజెక్టు

కేంద్ర కాఫీబోర్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహకారంతో 2015లో రూ.516 కోట్లతో లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి సంబంధించి ప్రాజెక్ట్ ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 84వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు నాటే పనులు పూర్తయ్యాయి.ఈ ఏడాది మిగిలిన 16వేల ఎకరాల్లో కాఫీ మొక్కలు నాటే పనులు పూర్తయితే లక్ష ఎకరాల ప్రాజెక్టు పూర్తవుతుంది.

● పాత తోటల్లో చనిపోయిన మొక్కలలను తొలగించి వాటి స్థానంలో సుమారు 12,999 మొక్కలు నాటనున్నారు. అంతేకాకుండా 15 వేల ఎకరాల్లో గ్యాప్ ఫిల్లింగ్ చేపట్టేందుకు ఐటీడీఏ చర్యలు చేపట్టింది.

ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పాడేరు డివిజన్‌లో కాఫీ సాగును విస్తరించి గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తోంది. కాఫీ రైతులను అన్నివిధాలా ప్రోత్సహించి సాంకేతిక సలహాలు అందిస్తున్నాం. యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్నాం. సుమారు రూ.7.70 కోట్ల వ్యయంతో జీకేవీధి, జి.మాడుగుల మండలాల్లో ఎకో పల్పింగ్ యూనిట్లను ఈఏడాది నిర్మిస్తున్నాం. గిరిజనులు కాఫీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– వి.అభిషేక్, పీవో, పాడేరు ఐటీడీఏ

క్లుప్తంగా

కో-ఆర్డినేటర్లకు బదిలీలు

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర శిక్షలో పని చేస్తున్న విద్యాశాఖ మండల కో ఆర్డీనేటర్లకు బదీలీల ప్రక్రియ చేపట్టారు. హుకుంపేటలో పనిచేస్తున్న విద్యాశాఖ మండల కో-ఆర్డినేటర్ వగ్గు జయరాజుకు పాడేరుకు, పాడేరు మండలంలో పనిచేస్తున్న కోటిలింగం పడాల్‌కు కొయ్యూరు మండలానికి, ముంచంగిపుట్టులో పనిచేస్తున్న కాళిదాసుకు హుకుంపేట మండలానికి బదిలీ చేశారు. వీరికి ఆయా మండలాల్లో విద్యశాఖాధికారులు బదిలీ ఉత్తర్వుల్ల అందజేశారు. పాడేరు మండల విద్యాశాఖ కో-ఆర్డీనేటర్‌గా నియమితులైన వగ్గు జయరాజు శనివారం ఎంఈవోలు సొనారి రామచంద్రరావు, సీహెచ్.సరస్వతిదేవి చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాల్లో సమగ్ర సర్వే

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు, టిక్రపడ, లుక్కూరు, బరేంగూల, గడ్డిబంధ గ్రామాల్లో జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు శనివారం పర్యటించారు.ఎన్ఆర్ఎస్‌టీసీ (నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రెనింగ్ సెంటర్స్) సర్వే చేశారు. పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, బడి బయట ఉన్న వారి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ జిల్లా ఏఎంవో భాస్కరరావు మాట్లాడుతూ విద్య హక్కు చట్ట ప్రకారం 13 మంది కన్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఆ గ్రామంలోనే ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు మొదటి విడతగా కొన్ని గ్రామాల్లో సర్వే చేస్తున్నామన్నారు. నివేదికల ఆధారంగా ఎన్ఆర్ఎస్‌టీసీ ఏర్పాటుచేయనున్నట్టు సీఆర్పీలు గౌరిశంకర్, సురేష్‌కుమార్, అనిల్‌కుమార్, హరి, ఈశ్వర్, సూర్య పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి చినరాజప్ప

వీఆర్ పురం/చింతూరు: చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక ప్రాంతాల్లో మాజీ మంత్రి చినరాజప్ప శనివారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలన పరిశీలించారు. బాధితులకు అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నేతలు నెహ్రు, రామకృష్టారెడ్డి, రాజేశ్వరి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: నీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులంతా ఆయిల్‌పామ్ మొక్కలు నాటి అధిక ఆదాయం పొందాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా మండలంలోని పూతిగుంట గ్రామంలో ఉద్యానవనశాఖ, పెద్దాపురం పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్‌లు సంయుక్తంగా శనివారం నిర్వహించిన ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఉద్యానవనశాఖ, పతాంజలి ఫుడ్స్ అధికారులు మాట్లాడుతూ మండలంలో 125 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసుకునేందుకు నీటి వనరులున్నట్టు గుర్తించామన్నారు.

సాగుకుప్రోత్సాహ నిధులు

ఎకరానికి 57 మొక్కలు వంతున రైతులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈతోటల వలన వచ్చే ఆదాయాన్ని వివరించారు.దీన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే దనలక్ష్మి మాట్లాడుతు ఉద్యానవనశాఖ, పతాంజలీ ఫుడ్స్ సంయుక్తంగా రూ.193 లు ఖరీదుచేసే ఆయిల్‌ఫామ్ మొక్కలను గిరిజరైతులకు పూర్తి ఉచితంగా అందజేస్తున్నారన్నారు. అలాగే మొక్కలు పెంచడానికి ఆయ్యే ఖర్చును నాలుగేళ్లపాటు ప్రభుత్వ సబ్సిడీగా నేరుగా లబ్ధిదారుని ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అన్ని పంటల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఇంకనూ మండలంలో నీటివనరులు ఉన్న రైతులు ఆయిల్‌ఫామ్ సాగుకు ముందుకు రావాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. దీన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆగ్రామంలోని ఐదుగురి రైతులకు, 5 ఎకరాలలో నాటడానికి మొక్కలను అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా ఒక రైతు పొలంలో ఆయిల్‌ఫామ్ మొక్కను నాటించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ బచ్చలి చిన్నమ్మలు, వైసీపీ జిల్లా కార్యదర్శి గుడ్ల త్రిమూర్తులు, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, ఐటీడీఏ ఉద్యానవన శాకాధికారి రమేష్ కుమార్, పతాంజలి డీజీయం ఏఎస్ ప్రకాశ్ , వారి సిబ్బంది, ఏఓ ఉషారాణి, ఏపీఓ ప్రకాష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, ఈఓపీఆర్డి మధుసూధన రాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్ కె రిజియా, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

హుకుంపేట: డ్రమ్ముసీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తోందని జిల్లా అగ్రికల్చర్ ఎడ్వైజరీ టెక్నికల్ సెంటర్ శాస్త్రవేత్త చిట్టిబాబు చెప్పారు. శనివారం మండలంలోని డి.చింతలవీధి గ్రామంలో డ్రమ్ముసీడర్ వినియోగం దాని వలన కలిగే ప్రయోజనలాపై అవగాహన కల్పించారు. పొలంలో విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయితే డ్రమ్ముసీడర్ విధానం ద్వారా తక్కువ విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తులు డ్రమ్ముసీడర్‌ను వినియోగించుకుని ఖర్చులకు, శ్రమలకు దూరం కావాలని కోరారు. జిల్లా అగ్రికల్చర్ ఎడ్వైజర్ టెక్నలజికాల్ సెంటర్ కో-ఆర్డినేటర్ జగన్నాథం, ఏవో లీలావతి, సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన

రాజవొమ్మంగి: రైతు సాధికార సంస్థ, ఏ.పీ.సీ.ఎన్.ఎఫ్. ప్రాజెక్ట్ కార్యకలాపాల్లో భాగంగా మండలంలోని కొమరాపురం యూనిట్‌లోని రైతులకు



రైతులకు ఘనజీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న సీఆర్పీ అప్పలరాజు

సామూహిక టైప్-1 ఘనజీవామృతం తయారీని సీఆర్పీ కె.అప్పలరాజు శనివారం వివరించారు.

100 కిలోల ఆవుపేట, తగినంతగా ఆవు మూత్రం, 2 కిలోల బెల్లం, గుప్పెడు పుట్ట మట్టితో ఈ మిశ్రమాన్ని తయారు చేసుకోవాలన్నారు. ఈ మిశ్రమాన్ని నీడలో ఆరబెట్టిన తరువాత 20 కిలోల ఘన జీవామృతం తయారు అవుతుందని, దీనిని మరో 100 కిలోల మాగిన ఆవుపేడతో కలపాలన్నారు. పంట వేసే ముందు ఆఖరి దుక్కులో ఈ మిశ్రమాన్ని వేయడం వల్ల నేల సారవంతంగా తయారు అవుతుందన్నారు. మొక్కలకు అవసరమైన అన్ని సూక్ష్మ, స్థూల పోషకాలు అందజేసే ద్రవజీవామృతం గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో 200 లీటర్ల నీరు, 10 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల ఆవుమూత్రం, 2 కిలోల పప్పుదినుసుల పిండి, గుప్పెడు పుట్టమన్ను ఓ డ్రమ్ములో వేసి బాగా కలపాలన్నారు. ఇది ఒక ఎకరా పొలానికి సరిపోతుందన్నారు. రెండు రోజుల తరువాత ఈ ద్రావణాన్ని పొలానికి నీరు వెళ్ళే కాలువలో కలపాలన్నారు. ఈ విధానం వల్ల నీరు లేకపోయినా మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఐసీఆర్పీలు లోవరెడ్డి, శ్రీను, పాపారావు, సత్యన్నారాయణ, అబ్బాయి, మల్లిఖార్జున, వలంటీర్లు వసంతం, నూకరత్నం రైతులు రాధాకృష్ణ, గిరిజాకుమారి, సీతమ్మ, సత్యవతి, రామారావు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



చింతూరులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీవో కొండలరావు, డీఎల్పీవో రాఘవన్

చింతూరు: డివిజన్లోని వరదముంపునకు గురైన నాలుగు మండలాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్టు డీపీవో టి.కొండలరావు శనివారం తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ఇందుకోసం 250 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు ప్రతి గ్రామంలో బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పూడికతో నిండిపోయిన మురుగు కాల్వలను శుభ్రం చేయించినట్లు ఆయన తెలిపారు. వరదల కారణంగా పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలు శుభ్రం చేయించామని డీపీవో పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో డీఎల్పీవో రాఘవన్, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టినట్లు ఆయన తెలిపారు.

మూగజీవాల మృతువాత



మృతి చెందిన దుక్కిటెద్దు



మృతి చెందిన గొర్రెలు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ టిక్కిటిబెడ్డ గ్రామంలోని ఏకలవ్య పాఠశాల ఆవరణలో స్థానిక ఆదివాసీలకు చెందిన పశువులు, గొర్రెలు మృతి చెంది ఉండడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పి.ప్రసాద్‌కు చెందిన ఎద్దు-1, అప్పారావు ఎద్దు-1, జి లచ్చన్న ఎద్దు1, చండల్-4 గొర్రెలు, మలియ్య-2 చొప్పున మృతి చెందాయి. నూతన పాఠశాల భవనం నిర్మాణం చేపడుతున్న ఆవరణలో మృతి చెందిన్నట్టు బాదితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్ట పరిహారం అందజేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్‌ను వివరణ కోరగా పశువులు ఎందుకు మరణించాయో పరీక్షలు జరుపుతామన్నారు.

‘బేబి’లో అదనంగా మరో పాట

- విశాఖ ప్రేక్షకులు ఆదరిస్తే సినిమా హిట్టే
- చిత్ర దర్శకుడు సాయి రాజేష్



అవంతి కాలేజీలో బేబి యూనిట్ సభ్యులు

అల్లిపురం: బేబి సినిమాలో ఆదివారం నుంచి మరో పాట యాడ్ చేస్తున్నట్లు చిత్ర దర్శకుడు సాయిరాజేష్ వెల్లడించారు. విశాఖ ప్రేక్షకులు ఆదరిస్తే ఆ సినిమా హిట్టేనన్నారు. నగరంలో శనివారం బేబి చిత్ర యూనిట్ సందడి చేసింది. డాబాగార్డెన్‌లోని 7 ల్యాంప్స్ హోటల్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో విలేకరులతో ముచ్చటించింది. ఈ సందర్భంగా హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ చిత్రం విడుదలై మూడు వారాలు అవుతున్నా.. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో రన్ అవుతోందన్నారు. మంచి సినిమాలను వైజాగ్ ప్రేక్షకులు విజయవంతం చేస్తారన్నారు. హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ తాను గీతంలో బీటెక్ చదివానన్నారు. బేబి సినిమా పట్ల ప్రేక్షకులు చూపుతున్న అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడితే బేబి చిత్రం విజయవంతంలో మీడియా సహకారం మరువలేనన్నారు. తన జీవితంలో ఎప్పుడూ గుర్తుండి పోయే సినిమా బేబి అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సినిమాను బాగా ఆదరిస్తున్నారని.. జగదాంబ థియేటర్‌లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ఆడుతోందన్నారు. నిర్మాత ఎస్.కె.ఎన్ మాట్లాడుతూ రూ.90 కోట్ల గ్రాస్‌తో బేబి చిత్రం విజయవంతంగా ఆడుతోందన్నారు. తాను విజయ దేవరకొండతో టాక్సీవాలా తర్వాత ఆనంద్‌తో బేబి తీశానని వివరించారు.